ప్రజాశక్తి

బుధవారం 18 జనవరి 2023

5

శ్రీకాకుళం



నేడు హైస్కూల్ సబ్జెక్టు టీచర్ల కౌన్సెలింగ్

శ్రీకాకుళం అర్బన్ : ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని జిల్లాపరిషత్ యాజమాన్యం పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జిటి తత్సమాన హోదా గల ఉపాధ్యాయులకు హైస్కూల్ సబ్జెక్టు టీచర్లుగా నియమించేందుకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గార పగడాలమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు 30 శాతం స్కూల్ అసిస్టెంట్ పోస్టుల ఖాళీలను (ఆంగ్లం, గణితం) హైస్కూల్ సబ్జెక్టు టీచర్లుగా అర్హత గల ఎస్‌జిటిలతో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వారికి నెలకు రూ.2,500 అలవెన్స్ ఇస్తూ నియామకం చేయనున్నట్లు తెలిపారు. అర్హత గల ఎస్‌జిటి, తత్సమాన ఉపాధ్యాయులు DEOSRIKAKULAM వెబ్‌సైట్‌లో పొందుపరిచిన సీనియార్టీ జాబితా ప్రాప్తికి నగరంలోని ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వే పాట్లు

- వెంటాడుతున్న సాంకేతిక సమస్యలు, సిబ్బంది కొరత
- అపరిష్కృతంగానే సరిహద్దు వివాద భూముల అంశం
- భూమి తక్కువగా నమోదు కావడంపై రైతుల్లో ఆందోళన
- సమాధానాలు చెప్పలేక తలలు పట్టుకుంటున్న అధికారులు

భూముల రీ సర్వే ప్రక్రియ జిల్లాలో అధికారులకు చుక్కలు చూపిస్తోంది. సాంకేతిక సమస్యలు, తగినంత సిబ్బంది లేకపోవడం, రైతుల నుంచి ఎదురవుతున్న ప్రశ్నలతో అధికారులు తలలు పట్టుకుంటున్నారు. తమ అనుభవంలో ఉన్న భూమి తక్కువగా రావడమేమిటని రైతులు అడుగుతున్న ప్రశ్నలతో సిబ్బంది ఏమీ చెప్పలేకపోతున్నారు. భూ సరిహద్దు వివాదాలు ఉన్న చోట ఇరువురికీ సర్దిచెప్పి కొన్నింటిని పరిష్కరిస్తున్నా, చాలా వరకు అపరిష్కృతంగానే ఉండిపోతున్నాయి. చిన్న చిన్న కమతాలు ఉండడంతో, సర్వేకు చాలా ఎక్కువ సమయం పడుతోంది. కుటుంబంలోని అన్నదమ్ముల మధ్య పంపకాల వివాదం ఉన్న వారిలో కొందరే వస్తున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో సర్వే మందకొడిగా, అసంపూర్ణంగా సాగుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, కవిటి

జిల్లాలో 1466 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. భూ సమగ్ర సర్వే కింద జిల్లాలో 9,86,092 ఎకరాలను సర్వే చేయాల్సి ఉంది. ఇందులో తొలివిడత 350 రెవెన్యూ గ్రామాల్లో 1,33,979 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 17,547 ఎకరాల్లో పూర్తి చేశారు. ఇంకా 1,16,433 ఎకరాలను సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటివరకు 223 ఇమేజ్‌లను తీసుకున్నారు. వాటిలో 43 చోట్ల ఇమేజ్‌లు సరిగా రాలేదు. 164 గ్రామాల్లో క్షేత్రస్థాయి నిర్ధారణ పూర్తయింది. 528 గ్రామాలకు సంబంధించి ఇమేజ్‌ల అప్‌లోడ్ పూర్తి చేశారు. ఇంకా 178 గ్రామాల ఇమేజ్‌లను తీసుకోవాల్సి ఉంది. జిల్లాలో ఇప్పటివరకు 34 గ్రామాలకు సంబంధించి ముసాయిదా రికార్డు ఆఫ్ రెవెన్యూ (ఆర్‌ఒఆర్) రూపొందించగా 13 గ్రామాల్లో ఆర్‌ఒఆర్ పూర్తయింది. ఆర్‌ఒఆర్ తుది జాబితాలో 6,886 ఎకరాలు నమోదైంది. 1466 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసేందుకు ప్రభుత్వం వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించింది. మార్చి 30వ తేదీలోగా డ్రోన్ సర్వే పూర్తి చేయాలని నిర్దేశించారు.



కవిటి : బల్లిపుట్టుగలో సర్వే చేస్తున్న సిబ్బంది

ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి

ప్రతిరోజూ 25 ఎకరాలు రీ సర్వే చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించింది. దీంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఒకవైపు యంత్రాలు పనిచేయకపోవడం, సిబ్బంది లేకపోవడంతో లక్ష్యాలను చేరుకోవడానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. కొన్నిచోట్ల చిన్న చిన్న కమతాల వల్ల ఆలస్యమవుతోంది. కుటుంబంలోని అన్నదమ్ముల మధ్య పంపకాల వివాదం ఉన్న వారిలో కొందరే వస్తున్నారు. రాని వారికి రెవెన్యూ సిబ్బంది ఫోన్ ద్వారా సమాచారం ఇస్తున్నారు. అప్పటికీ రాకపోతే రీ సర్వే చేపట్టి వివరాలు రాసుకుని వెళ్తున్నారు. కొందరు రైతులు స్థానికంగా ఉండడం లేదు. వారికి సమాచారం ఇచ్చి వదిలేస్తున్నారు.

వెంటాడుతున్న సిబ్బంది కొరత

సర్వే ప్రక్రియలో కీలకంగా ఉన్న రోవర్స్ జిల్లాలో తగినన్ని లేవని తెలుస్తోంది. సర్వే పూర్తి చేయాలంటే మండలంలో ఉన్న సిబ్బంది సరిపోవడం లేదు. బయట ప్రాంతం నుంచి అదనపు బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వారికి అక్కడ పరిస్థితి తెలియకపోవడం, సరైన సహకారం లేకపోవడంతో సర్వేలో సమస్యలు ఏర్పడుతున్నాయి. ఉదాహరణకు ఒక రైతుకి సంబంధించి ఒక రెవెన్యూ గ్రామంలో ఎన్ని సర్వే నంబర్లు ఉన్నా ఖాతా నంబరు ఒకటే ఉండాలి. కానీ పైన పేర్కొన్న సమస్యతో ఒక్కో సర్వే నంబరుకు ఒక్కో ఖాతా నంబరు వచ్చేసింది. దీంతో మళ్లీ మొత్తం సరిచూసుకోవాల్సి వస్తోంది.

అనుభవంలో ఒకలా... సర్వేలో మరోలా

కవిటికి చెందిన బెందాళం వేణుకు 52 సెంట్ల భూమి ఉంటే, సర్వేలో 48 సెంట్లు చూపించింది. నౌపడ పంచాయతీ కూర్మనాథపురంలో కోట రామ్మూర్తి ఆస్తి పక్కనే ఉన్న పాఠశాల ప్రహరీ విషయంలో భూ తగాదా ఏర్పడింది. భూ సరిహద్దు సమస్యతో పాఠశాల ప్రహరీ నిర్మాణం ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉంది.

అపరిష్కృతంగానే సరిహద్దు వివాదాలు

వివాదాలతో కోర్టు కేసుల్లో ఉన్న వాటిని మాత్రమే వదిలేస్తున్నారు. మిగిలినవి రీ సర్వే చేస్తున్నారు. ఉమ్మడి కుటుంబాలకు చెందిన పత్రాల్లో ఒకలా, అనుభవంలో మరోలా ఉంటున్నాయి. రీ సర్వే చేసినప్పుడు తేడాలు రావడంతో కొత్త సమస్యలు వస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కొందరు అన్నదమ్ములు సర్వేకు రావడం లేదు. ఫోన్లు చేసి బలవంతంగా రప్పిస్తున్నారు. ఎక్కువ, తక్కువ, వచ్చిన చోట రెవెన్యూ, సర్వేశాఖ సిబ్బంది సర్దిచెప్పి సర్దుబాటు చేస్తున్నారు. ఇప్పుడే చేసుకోవాలి, ఆ తర్వాత మళ్లీ కాదని పేర్కొంటుండడంతో చిన్నపాటి సమస్యలు ఉన్నచోట ఎక్కువ మంది సర్దుకుపోతున్నారు.



మిల్లర్లపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

అదనంగా ధాన్యం ఇస్తేనే...

- లేదంటే వెనక్కి పంపించేస్తున్నారు
- ప్రశ్నిస్తే దిక్కున్న చోట చెప్పుకోండి అంటున్నారు
- మిల్లర్లపై కలెక్టర్‌కు రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆమదాలవలస

రైతుభరోసా కేంద్రాల్లో ట్యాగ్ చేసిన శ్రీకాకుళం, గార మండలాల్లోని పలు రైస్ మిల్లుల్లో నాలుగు నుంచి ఐదు కేజీల వరకు అదనంగా ధాన్యం ఇస్తేనే తీసుకుంటున్నారని మండలంలోని లక్ష్ముడుపేట, శ్రీనివాసాచార్యులపేట రైతులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. ఆ గ్రామాల్లోని సచివాలయాలను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు కలెక్టర్‌ను కలిసి ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. క్వింటాకు 5 కేజీలు, 80 కేజీల బస్తాకు నాలుగు కేజీల చొప్పున అదనంగా ఇవ్వకుంటే ధాన్యాన్ని వెనక్కి తీసుకుపోవాలని శ్రీకాకుళం రూరల్ మండలం సింగుపురంలోని శ్రీ మారుతి సాయిలక్ష్మి, సానివాడలోని శ్రీలక్ష్మి గణపతి సచ్చిదానంద, గార మండలంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర, ఇట్రాజు శ్రీరాములు, శ్రీ లక్ష్మీ గణపతి రైస్‌మిల్లుల యజమానులు కరాఖండిగా చెప్తున్నారని తెలిపారు. ఇదేమిటని ప్రశ్నిస్తే మీ ధాన్యాన్ని తీసుకోం, దిక్కున్న దగ్గర చెప్పుకోండి అని ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విచారణ చేసి, చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిల్లర్లకు అదనంగా ధాన్యం ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలపై జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి ఫిర్యాదుదారులు శ్రమకోర్చి వస్తున్నారని కలెక్టర్ సచివాలయ సిబ్బందితో అన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఉన్నతాధికారుల చుట్టూ తిరిగే వ్యవస్థను సరిచేసి ప్రజా సమస్యల పరిష్కారం కోసమే గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను ప్రభుత్వం తీసుకొచ్చిందన్న విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. జిల్లాస్థాయి స్పందన అర్జీలను క్రోడీకరిస్తున్నామని, ఆయా సచివాలయాల సిబ్బంది పనితీరుపై ప్రభుత్వపరమైన చర్యలు తీసుకోనున్నామని తెలిపారు.

సోషల్ ఆడిట్‌లో భాగంగా నవరత్నాల సంక్షేమ పథకాల అర్హుల జాబితాలను ఎప్పటికప్పుడు నవీకరించి, ప్రజల సమాచారార్థం నోటీసు బోర్డులో ఉంచాలని ఆదేశించారు. కార్యదర్శులు వారి విధులపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. పౌర సేవలను అందించడంలో వాలంటీర్లు ప్రభుత్వ ఉద్దేశాలకు అనుగుణంగా నడచుకోవాలని తెలిపారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో భాగంగా సచివాలయాల రికార్డులను, సిబ్బంది హాజరును కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ బి.లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ ఎం.రేణుక, ఎపిఎం పైడి కూర్మారావు, వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, ఎంఇఒ దుప్పల రామారావు, మండల ఇంజనీరింగ్ అధికారి జ్యోతితో పాటు హౌసింగ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ గడువు పొడిగింపు

- ఇప్పటివరకు 87 శాతమే పంపిణీ
- ఆలస్యంగా చేరిన సరుకుల నిల్వలు
- లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడమూ కారణమే
- ఈనెల 20 వరకు సరుకులు ఇవ్వాలని నిర్ణయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా చేపడుతున్న సరుకుల పంపిణీని ఈనెల 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి ప్రతి నెల 17వ తేదీతో సరకుల పంపిణీ ప్రక్రియను ప్రభుత్వం నిలిపివేస్తుంది. ఈసారి చౌక ధరల దుకాణాలకు ఆలస్యంగా సరుకులు చేరడంతో, పూర్తిస్థాయిలో పంపిణీ జరగలేదు. సంక్రాంతి, కనుమ రోజులు సెలవు కావడంతో సరుకుల పంపిణీ చేపట్టలేదు. అదీగాక పండగ నేపథ్యంలో కొన్ని కుటుంబాలు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లి పోవడంతో వారు సరుకులను తీసుకోలేకపోయారు. దీంతో మరో నాలుగు రోజులు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జిల్లాలో 6,61,818 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 19,55,353 మంది లబ్ధిదారులు ఉన్నారు. వాటిలో ఇప్పటివరకు 5,76,902 కార్డుదారులే సరుకులను తీసుకున్నారు. అంటే 87.16 శాతం మందికి మాత్రమే సరుకులు దక్కాయి. ఇంకా 84,916 మంది సరుకులు తీసుకోలేకపోయారు. రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉంది. అనుకున్న లక్ష్యం మేరకు లబ్ధిదారులకు సరకులు చేరలేదని గుర్తించిన ప్రభుత్వం, మరో నాలుగు రోజుల పాటు పంపిణీ చేయాలని నిర్ణయించింది. జనవరి నెలకు సంబంధించి రేషన్ కార్డుదారులకు 97,248 క్వింటాళ్ల బియ్యాన్ని కేటాయించింది. అందులో ఇప్పటివరకు 5,74,459 కార్డుదారులకు 93,563 క్వింటాళ్ల బియ్యాన్ని అందించారు. లబ్ధిదారుల్లో 3,62,137 కుటుంబాలకే (54.72 శాతం) పంచదారను పంపిణీ చేశారు. కందిపప్పు 2,63,366 కుటుంబాలకు (39.79 శాతం) మాత్రమే అందించారు

మూడు మండలాల్లో బియ్యం పంపిణీ 80 శాతం లోపే...

జిల్లాలో మూడు మండలాల్లో ఇప్పటివరకు 80 శాతం కూడా బియ్యం పంపిణీ కాలేదు. రేషన్ పంపిణీలో ఇచ్ఛాపురం అట్టడుగున ఉంది. ఇక్కడ 26,719 రేషన్‌కార్డులు ఉండగా, 20,323 కార్డుదారులకు (76.06 శాతం) కుటుంబాలకు బియ్యం అందించారు. కవిటిలో 22,490 కార్డులు ఉండగా 17,300 కుటుంబాలకు (76.92 శాతం) పంపిణీ చేశారు. మందసలో 24,369 కార్డులు ఉండగా, ఇప్పటివరకు 19,115 కుటుంబాలకు (78.44 శాతం) బియ్యం అందించారు. అత్యధిక శాతం మందికి బియ్యం పంపిణీ జరిగిన మండలాల్లో శ్రీకాకుళం మండలం ప్రథమ స్థానంలో ఉంది. ఇక్కడ 56,507 కార్డులు ఉండగా, 52,523 మందికి (92.95 శాతం) మందికి బియ్యం ఇచ్చారు. ఆ తర్వాత స్థానంలో పలాస (92.06 శాతం), సోంపేట (91.39 శాతం), కంచిలి, లావేరు (91 శాతం), పోలాకి (90.94 శాతం), ఆమదాలవలస (90.12 శాతం) మండలాలు ఉన్నాయి.

కందిపప్పు అంతంతమాత్రంగానే పంపిణీ

జిల్లాలో కందిపప్పు పంపిణీ అంతంతమాత్రమే జరిగింది. జిల్లాకు 6,618 క్వింటాళ్ల కందిపప్పును పంపిణీ చేయాల్సి ఉండగా, రేషన్ దుకాణాలకు 2,601 క్వింటాళ్ల కందిపప్పు చేరింది. జిల్లాకు వచ్చిన సరుకునే అంతటా సర్దుబాటు చేశారు. రణస్థలం, సంతబొమ్మాళిలో కనీసం పది శాతం మందికీ కందిపప్పు ఇవ్వలేదు. రణస్థలం మండలంలో 27,723 కార్డుదారులు ఉండగా, కేవలం 839 కుటుంబాలకు (3.03 శాతం) మాత్రమే కందిపప్పును పంపిణీ చేశారు. సంతబొమ్మాళి మండలంలో 22,914 మంది కార్డుదారులు ఉండగా 2,232 కుటుంబాలకు (9.74 శాతం) అందించారు. మరో ఐదు మండలాల్లో పంపిణీ 20 శాతం కూడా దాటలేదు. సోంపేటలో 12.27 శాతం, లావేరు 13.57 శాతం, పొందూరు 16.07 శాతం, పాతపట్నం 18.96 శాతం, జి.సిగడాం 19.32 శాతం కుటుంబాలకు కందిపప్పు ఇచ్చారు.



పంచదార పంపిణీ కాస్త బాగు

జిల్లాలో ఒకటీఅరా చోట్ల మినహా పంచదార పంపిణీ కాస్త బాగానే సాగింది. జిల్లాకు 13,970 క్వింటాళు కేటాయించగా, చౌక ధరల దుకాణాలకు 8,339 క్వింటాళు చేరింది. ఒక్క టెక్కలి మినహా అన్నిచోట్లా పంపిణీ శాతం మెరుగ్గానే ఉంది. టెక్కలిలో 21,742 మంది కార్డుదారులు ఉండగా 1705 కుటుంబాలకు (7.84 శాతం) మాత్రమే పంచదార ఇచ్చారు. సంతబొమ్మాళిలో 22,914 మంది కార్డుదారులు ఉండగా 6043 కుటుంబాలకు (26.37 శాతం) పంపిణీ చేశారు. రణస్థలం మండలంలో 27,723 కార్డులు ఉండగా 8,467 కుటుంబాలకు (30.54 శాతం) కుటుంబాలకు అందించారు. సోంపేటలో 21,985 కార్డులు ఉండగా 6,857 కుటుంబాలకు (31.19 శాతం) పంపిణీ చేశారు.

అదనపు గదులకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులకు స్థలాన్ని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని కనకాద్రి చెరువులో లక్ష్మీనగర్ ఉన్నత పాఠశాలకు కేటాయించిన 28 సెంట్ల స్థలం వివరాలను తహశీల్దార్ ఎం.గణపతిరావును అడిగి తెలుసుకున్నారు. కనకాద్రి చెరువు 6.64 ఎకరాల విస్తీర్ణం కాగా, అందులో ఐదు ఎకరాలు డిగ్రీ కళాశాలకు కేటాయించినట్లు తహశీల్దార్ తెలిపారు. ఎకరా 64 సెంట్లు ఉందని, అందులో 28 సెంట్లు అదనపు తరగతి గదులకు కేటాయిస్తున్నట్లు వివరించారు.



స్థల వివరాలను అధికారులను అడిగి తెలుసుకుంటున్న జెసి నవీన్

లక్ష్మీనగర్ స్కూలు ఆవరణలో ప్రభుత్వ స్థలం ఉందా అని అధికారులను అడిగారు. ఇప్పటికే ఉన్న స్థలంలో ఒకవైపు ప్రాథమిక పాఠశాల, మరోవైపు ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులు రెండు అంతస్తుల వరకు నిర్మించామని బదులిచ్చారు. అయినా విద్యార్థులకు గదులు సరిపోవడం లేదని చెప్పారు. డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ కె.అప్పలనాయుడును జెసి ఆదేశించారు. కార్యక్రమంలో టిపిఎస్ హెచ్.వి సత్యనారాయణ, మండల సర్వేయర్ బొడ్డేపల్లి గోవిందరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌ప్లాన్ చట్టాన్ని పొడిగించాలి

ప్రజాశక్తి - పొందూరు

ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని శాశ్వతంగా పొడిగించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం విశాఖ జిల్లా ఉపాధ్యక్షులు కూన వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్‌ప్లాన్ చట్టాన్ని పొడిగించాలని కోరుతూ మండల కేంద్రంలో బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెవిపిఎస్, డిహెచ్‌పిఎస్, ఇతర దళిత సంఘాల ఆధ్వర్యాన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జునను కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేస్తున్న నాయకులు

టిడిపి బిసి సంఘం ఆమదాలవలస నియోజకవర్గ అధ్యక్షులు చింతాడ కృష్ణవాసుదేవరావు మాట్లాడుతూ సబ్‌ప్లాన్ నిధులను వైసిపి ప్రభుత్వం దారిమళ్లిస్తూ ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం చేస్తోందని విమర్శించారు. కార్యక్రమంలో చింతాడ అప్పలనాయుడు, బాడాన కృష్ణ, చింతాడ ప్రసాద్, చింతాడ సాగర్, బాడాన భాస్కరరావు శీర రమణ, వై.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఫేస్ అటెండెన్స్ అమలు

- జిల్లా నుంచి గ్రామస్థాయి వరకు
- ఉదయం, సాయంత్రం హాజరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విమర్శలు వెల్లువెత్తుతున్నా ఫేస్ అటెండెన్స్ (ముఖ హాజరు)పై ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఉపాధ్యాయుల నుంచి మొదలైన ఈ హాజరు జిల్లా నుంచి గ్రామస్థాయి సచివాలయ ఉద్యోగుల వరకు ఈనెల 17వ తేదీ నుంచి అమల్లోకొచ్చింది. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, ఉద్యోగులు ముఖ హాజరు వేయాల్సిందేనని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 16న సెలవు రోజు కావడంతో, 17వ తేదీ నుంచి కచ్చితంగా అమలు చేయాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రస్థాయి విధులకు వెళ్లే వారు ఫేస్ అటెండెన్స్ వేయడం ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నారు.



ఇక నుంచి అందరికీ...

జిల్లాలో 69 ప్రభుత్వ శాఖలు పనిచేస్తున్నాయి. వాటికి అనుబంధంగా మరికొన్ని కార్యాలయాలు ఉన్నాయి. జిల్లాలో సుమారు 27 వేల మంది రెగ్యులర్, ఐదు వేల మంది కాంట్రాక్టు, నాలుగు వేల మంది అవుట్‌సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్నారు. వీరిలో అత్యధికంగా ఉపాధ్యాయులు, ఆ తర్వాత వైద్యారోగ్యశాఖ ఉద్యోగులే. ఇతర శాఖల్లో పదుల సంఖ్య మొదలు వందల సంఖ్యలో ఉద్యోగులు సేవలు అందిస్తున్నారు. వీరందరికీ మంగళవారం నుంచి ముఖ హాజరు తప్పనిసరి చేశారు. ఈ మేరకు ట్రెజరీ కార్యాలయానికి సమాచారం అందింది. పర్యవేక్షణ బాధ్యతలను జిల్లా రెవెన్యూ అధికారికి అప్పగిస్తూ నోడల్ అధికారిగా నియమించారు. జిల్లాస్థాయిలో ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఆర్థిక లావాదేవీలు ఖజానా శాఖ ద్వారా జరుగుతాయి. దీంతో ఆ కార్యాలయానికి ఉద్యోగుల హాజరును అనుసంధానం చేశారు.

అంతంతమాత్రమే..

కొత్త సంవత్సర కానుకగా ముఖ హాజరును తప్పనిసరి చేసిన ప్రభుత్వం, ఈనెల 16 నుంచి శతశాతం అమలయ్యేలా ఆదేశాలు జారీ చేసింది. అవగాహన లేకపోవడం, సాంకేతిక సమస్యల కారణంగా చాలామంది ముఖ హాజరు వేయలేకపోతున్నారు. కలెక్టరేట్‌తో పాటు జిల్లా కార్యాలయాల్లో డెప్యుటేషన్లపై పనిచేస్తున్న వారికి ముఖ హాజరు వేయడానికి అవకాశం కల్పించలేదు. దీంతో వారిలో గుబులు మొదలైంది.

మూడుసార్లు ముఖ హాజరు లేకుంటే సెలవు

ప్రభుత్వం నిర్ణయించిన సమయంలోపు హాజరు వేయకుంటే విధులకు ఆలస్యమైనట్లు పరిగణిస్తారు. మూడుసార్లు ఆలస్యంగా హాజరు వేస్తే ఒక సిఎల్ కింద నమోదు చేస్తారు. ఈ హాజరు ఆధారంగానే ప్రభుత్వం వేతనాలు చెల్లిస్తుంది. మండలస్థాయిలో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు, ఎపిఒలు, ఎపిఎంలు, విఆర్‌ఒలు, సర్వేయర్లు క్షేత్రస్థాయికి వెళ్లాల్సి ఉంటుంది. వీరు కార్యాలయ ప్రాంగణంలో హాజరు వేయడం ఎలా అన్నది ప్రశ్నగా మారింది. కార్యాలయాలకే పరిమితమైతే, క్షేత్రస్థాయిలో పనులు ఎలా పూర్తి చేయగలమని వారంటున్నారు.

ఉద్యోగుల్లో టెన్షన్

ముఖ హాజరు విధానాన్ని ఎపి సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ సిస్టమ్స్ సర్వీసెస్ నిర్వహిస్తోంది. ఇప్పటివరకు ఆధార్ బేస్డ్ విధానంలో సిఎఫ్‌ఎంఎస్ ద్వారా బయోమెట్రిక్ హాజరు అమలు చేశారు. ఇప్పుడు ప్రతి ఉద్యోగి తన ఆండ్రాయిడ్ ఫోన్‌లో మాత్రమే యాప్ ఇన్‌స్టాల్ చేసుకోవాల్సి ఉంది. ఉద్యోగులు పనిచేసే కార్యాలయాలను సెంటర్ పాయింట్‌గా చేసుకుని, ఆ పరిసరాల్లో మాత్రమే యాప్ పనిచేస్తుంది. ఫోన్‌కు జియోట్యాగ్ అనుసంధానం చేయడంతో, దూరంగా ఉంటే యాప్ సహకరించదు. మూడు రోజులుగా ఉద్యోగుల ఫోన నంబర్లు, ఆధార్, ఈమెయిల్, ఐడి నంబరు తదితర వివరాలను సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేశారు. ఉదయం 10 నుంచి 10.30 గంటల్లోపు విధిగా హాజరు వేయాలి. సాయంత్రం ఐదు గంటల తర్వాత మరోసారి హాజరు వేయాలి. హాజరుకు 30 నిమిషాల ముందు మాత్రమే యాప్ పనిచేస్తుంది. యాప్‌పై అవగాహన కల్పించకుండా, అమలు చేయడం వల్ల ఉద్యోగులు మంగళవారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

క్షేత్రస్థాయికి వెళ్లే వారికి ఎలా..?

క్షేత్రస్థాయికి వెళ్లి విధులు నిర్వర్తించే ఉద్యోగులు హాజరు ఎలా వేస్తారు? పలు శాఖల ఉద్యోగులు ఉదయం ఏడు గంటలకే క్యాంపునకు వెళ్లాల్సి ఉంటుంది. డెప్యుటేషన్‌లో పనిచేస్తున్న వారికి హాజరు ఆప్షన్ ఇవ్వలేదు. ఇది ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం. ముఖ హాజరులో లోపాలను సరిచేయాలి. ఉద్యోగ సంఘాలతో చర్చించకుండా నిర్ణయం తీసుకోవడం బాధాకరం. వైద్యశాఖలో అత్యవసర పరిస్థితుల్లో సమయం చూడకుండా వెళ్లి సేవలు అందిస్తారు. వారికీ పనిచేసే చోట ముఖ హాజరు నిబంధన పెట్టడం సరికాదు. ప్రభుత్వం ఆలోచించాలి.

- హనుమంతు సాయిరాం,
జిల్లా అధ్యక్షులు, ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్

సమయం వరకే పనిచేస్తే ఒప్పుకుంటారా..?

నిర్ణీత సమయంలో హాజరు వేయకపోతే ఆబ్సెంట్ పడుతుంది. జీతాలు కట్ అవుతాయి. కొన్ని శాఖల్లో ఉదయం నుంచి రాత్రి వరకు పనిచేయాల్సి వస్తుంది. దానికి అదనంగా

రేపట్నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

2023-24 ఆర్థిక సంవత్సరానికి అమలు చేయనున్న విద్యుత్ ఛార్జీల (టారిఫ్)పై ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యాన ఈనెల 19వ తేదీ నుంచి ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ డిఇ వి.ఎ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్ పంపిణీ సంస్థలు ఎపిఇఆర్‌సికి సమర్పించిన వార్షిక ఆదాయ అవసర నివేదికలపై ఈనెల 19, 20, 21 తేదీల్లో విశాఖపట్నంలోని ఇపిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి ఒంటిగంట వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ పంపిణీ సంస్థల టారిఫ్ ఫైలింగ్‌కు సంబంధించిన సూచనలు, అభ్యంతరాలు, అభిప్రాయాలను విశాఖపట్నం నుంచే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వీకరిస్తారని తెలిపారు. అభిప్రాయాలు చెప్పాలనుకునే వారు టెక్కలి విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం నుంచి పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించేందుకు వీలుగా https://ncubestreamings.com/apercpublic-hearing వెబ్ లింక్ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.



ప్రశంసాపత్రాలతో విద్యార్థులు

జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు పయనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

గుంటూరు జిల్లా రేపల్లెలో ఈ నెల 11 నుంచి 13 వరకు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో గెలుపొంది జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 18 నుంచి 21 వరకు తమిళనాడు రాష్ట్రంలో ఈరోడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి తైక్వాండో పోటీలకు వెళ్లనున్నారు. ఇందులో భాగంగా మంగళవారం స్థానిక వైఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో కౌన్సిలర్లు పిలక విజయకుమార్, సిగ్గ ప్రేమ్‌కుమార్, కాళ్ల దిలీప్ అభినందనలు తెలియజేశారు. ఇచ్ఛాపురం నుంచి 14 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలో పాల్గొన్నారు. అందులో ఆరుగురికి బంగారు, ఒకటి రజిత, నాలుగు కాంస్య పథకాలు సాధించారు. సబ్ జూనియర్ విభాగంలో పి.దమయంతికి బంగారం, ఎ.అఖిల్ బ్రాంజ్‌కు మెడల్, ఎ.ఆక్సైజ్‌రెడ్డికి బ్రాంచ్ మెడల్, సిహెచ్.చందు బ్రాంచ్ మెడల్, వినయ్ కుమార్ సిల్వర్ మెడల్, ఆర్.ఇందు బ్రాంచ్ మెడల్ సాధించారు. పి.చైతన్య గోల్డ్ మెడల్, సిహెచ్.గిరిరెడ్డి గోల్డ్ మెడల్, ఎస్.జై.రామ్ గోల్డ్ మెడల్, పి.ధరణిరెడ్డి, గోల్డ్ మెడల్ సాధించారు. కార్యక్రమంలో సైనిక ఉద్యోగి ఎల్.సి.రావు, పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

పలాస: పలాసలోని టిడిపి కార్యాలయంలో ఎన్‌టిఆర్ 27వ వర్ధంతి సందర్భంగా బుధవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదాన శిబిరానికి పలాస నియోజకవర్గ టిడిపి నాయకులు, కార్యకర్తలు, ఎన్‌టిఆర్ అభిమానులు, యువకులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు.



విజయ సంకేతం చూపిస్తున్న యువకులు, చిన్నారులు

ఉల్లాసంగా... ఉత్సాహంగా...

పోలాకి : మండలంలోని సంతలక్ష్మీపురంలో 'పట్నం సాగనంపుతుంది.. పల్లె స్వాగతిస్తుంది' పేరిట యూత్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు నాలుగు రోజుల పాటు నిర్వహించిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిసింది. అలాగే యువతీ యువకులకు, చిన్నారులకు వివిధ విభాగాల్లో రంగవల్లులు, వక్తృత్వ, క్విజ్, ఉట్టికొట్టడం, వ్యాయామ, సాము గరిడీ పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు సర్పంచ్ నీలవేణి రమణ, గ్రామపెద్దలు బహుమతను అందజేశారు. గ్రామంలో పేకాటలు, మద్యానికి దూరంగా ఉంచి ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించిన యువకులను గ్రామస్తులు అభినందించారు.

పంచ సూత్రాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎపిఎం కూర్మారావు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మహిళా స్వయం శక్తి సంఘాలు విధిగా పంచసూత్రాలు పాటించాలని, అప్పుడే మహిళలు స్వయం సమృద్ధి సాధించగలుగుతారని వైఎస్‌ఆర్ క్రాంతి పథ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని రామచంద్రాపురం పంచాయతీ పొన్నంపేటలో రామాలయం దగ్గర స్వయం శక్తి

ఎపిఎం కూర్మారావు

సంఘాల లీడర్ల మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి స్వయం శక్తి సంఘమూ నెలవారి సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలోనే పొదుపు, అప్పులు ఆర్థిక లావాదేవీలను అందరి సమక్షంలో చర్చించాలన్నారు. ప్రతి అంశాన్నీ సంఘ సభ్యులు తీసుకున్న నిర్ణయాన్ని తీర్మానం పుస్తకంలో వెంటనే రాయించుకొని సభ్యులందరూ ఆమోదించి పుస్తకాల్లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. సభ్యురాలు తీసుకున్న ప్రతి అప్పునూ రూపాయి వడ్డీతో తిరిగి సంఘానికి రీపేమెంట్ అయ్యేటట్లు చూడాల్సిన బాధ్యత సంఘ సభ్యులందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమాలన్నీ సక్రమంగా నిర్వహించేటట్లు బాధ్యతలను తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఒఎ గాయత్రి, గ్రామ సంఘం ప్రతినిధులు, స్వయం శక్తి సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని కరాపాడు టోల్ ప్లాజాలో లారీడ్రైవర్లు, రోడ్డు ప్రయాణికులకు మంగళవారం నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల అవగాహన కార్యక్రమంలో భాగంగా ఈ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎన్‌హెచ్‌ఎఐ పీడీ ఎన్.హరికృష్ణ తెలిపారు. నిరంతరం సుదూర ప్రాంతాలకు ప్రయాణించే వారికి, తరచూ ప్రయాణాలు చేసే వారికి నేత్ర వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. ఇందులో భాగంగా 120 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా కంటి అద్దాలు, మందులు పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్లు సెంథిల్ కుమార్, వివికెఎస్ ప్రసాద్, టోల్ ప్లాజా మేనేజర్లు జి.వెంకటరమణ, ఉమరుద్దీన్, కొప్పల రవి, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : మండలంలోని లక్ష్మీపురం టోల్ ప్లాజా వద్ద జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రాజెక్టు మేనేజర్లు సింథిల్ కుమార్, వి.వి.కె.వి.ప్రసాద్ ఆధ్వర్యాన ఉచిత నేత్ర వైద్య



కవిటి : కళ్లద్దాలను అందజేస్తున్న హరికృష్ణ

శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కంటికి సంబంధించిన వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శిబిరంలో 50 మంది రోగులకు ఉచిత నేత్ర వైద్య పరీక్షలను డాక్టర్ దివాకర్ నిర్వహించారు. అనంతరం భద్రతా ప్రతిజ్ఞ, రహదారుల భద్రతపై వాహన చోదకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టోల్ మేనేజర్ మోహనరావు, శేఖర్ రాథోడ్, ఐఎంటి మేనేజర్ ధనరాజ్ పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న సంఘం ప్రతినిధులు

క్రీడాకారులకు కోడిరామ్మూర్తి ఆదర్శం

శ్రీకాకుళం అర్బన్ : మల్లయోధుడు కోడిరామ్మూర్తి ప్రపంచానికే ఆదర్శంగా నిలిచారని పలువురు కొనియాడారు. మంగళవారం కోడిరామ్మూర్తి వర్ధంతిని పురస్కరించుకుని ఏడు రోడ్ల కూడలి వద్ద ఉన్న లిఖిత్ ఎడ్యుకేషనల్ ట్రస్టు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కోడిరామ్మూర్తి సంక్షేమ సంఘం అధ్యక్షులు జి.మోహన్ మాట్లాడుతూ ప్రస్తుత మన్యం జిల్లా వీరఘట్టం మండలంలో పుట్టిన కోడిరామ్మూర్తి మల్లయోధుడిగా కీర్తి కెక్కారన్నారు. ఆయన స్ఫూర్తితో క్రీడాకారులు అంతర్జాతీయ ఖ్యాతి పొందారన్నారు. ఆయన పేరుతో నగరంలో ఉన్న కోడిరామ్మూర్తి స్టేడియంను త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎం.గురునాథరావు, ఇంటి గోపి, దుర్గాప్రసాద్, మోహనరావు పాల్గొన్నారు.

సరుకులు అందజేత

పలాస : మండలంలోని గోవిందాపురం పంచాయతీ గూనాలపాడు యువకులు కాశీబుగ్గ లలిత ఛారిటబుల్ ట్రస్టు కోసంగిపాడు ట్రస్టుకు మంగళవారం నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమంలో చెన్నంశెట్టి కలిరావు, ధనరాజ్ విఘ్నేష్, కూర్మారావు, నాగేష్, చిరంజీవి, యుగంధర్ పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక... ఆనంద హేళ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆనంద హేళ నడుమ ఘనంగా నిర్వహించారు. మండలంలోని గోవిందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-1990లో పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల మెగా ఆత్మీయ సమ్మేళనం వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సత్కరించారు. 33 ఏళ్ల తర్వాత కలుసుకున్న మిత్రులు తమ జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. విద్యార్థులు సంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు టి.లింగరాజు, బమ్మిడి నరేంద్ర, చింత ఉమారావు, పూర్వ విద్యార్థులు మద్దిలి హరినారాయణ, దువ్వాడ లక్ష్మీభార్గవి, లోకనాథం,



వజ్రపుకొత్తూరు : జ్ఞాపికలతో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

లాభాల సిరి, పాఠశాల వెంకటరావు, దేవదాసు రవి, ప్రసాద్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్: మండలంలోని పోలవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయంగా పలకరించుకున్నారు. రెండు దశాబ్దాల అనంతరం పూర్వ విద్యార్థులు అంతా ఒక చోటకు చేరి అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుని ప్రతిఒక్కరూ ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బెండి అప్పలసూర్యనారాయణ, సనపల అప్పన్న, పూర్వ విద్యార్థులు పి.ధర్మారావు. ప్రగడ సాయిరాం, బమ్మిడి సంతోష్, కుప్పిలి ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యం

మెళియాపుట్టి: విద్యార్థి దశ నుంచే చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత అందించాలని బాణాపురం సర్పంచ్ పెద్దింటి సుందరరావు సూచించారు. సంక్రాంతి పండుగను పునస్కరించుకొని ప్రీమియం క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం నిర్వహించారు. పదనాపురం విన్నర్‌గా, సవరబాణాపురం రన్నర్‌గా నిలిచాయి. గెలుపొందిన జట్లకు బహుమతులు



బహుమతులను అందజేస్తున్న సర్పంచ్ సుందరరావు

అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.కరుణాకర్, కిరణ్ వార్డు మెంబర్లు పాల్గొన్నారు.



రాంబాబు మృతదేహం

యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలోని జర్జంగి జాతీయరహదారి సమీపంలో మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం కింజరాపువానిపేటకు చెందిన బర్ల అప్పలస్వామి (రాంబాబు) (27) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... మృతుడు రాంబాబు భార్య, పిల్లలు నాలుగు రోజుల క్రితం సంక్రాంతికి తన అత్తవారు గ్రామం యలమంచిలిలో దించి తన సొంత గ్రామానికి వెళ్లిపోయాడు. వారికి తిరిగి తీసుకునేందుకు తన గ్రామం నుంచి ద్విచక్ర వాహనంపై వస్తుండుగా జర్జంగి సమీపంలో వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొన్నడంతో రాంబాబు తలకు తీవ్రగాయమైంది. వెంటనే స్థానికులు 108లో స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృత్యువాత పడ్డాడు. అప్పటి వరకు గ్రామంలో సరదాగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో గడిపి అంతలోనే మృత్యువార్త తెలుసుకున్న అలుకింజరాపుపేట గ్రామం, ఇటు యలమంచిలి గ్రామం సోమసముద్రంమైంది. మృతుడు వృత్తిరీత్య గొర్రెలు కాసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు సుస్మిత, మోక్షిత, వృద్ధులైన తల్లిదండ్రులు జోగులమ్మ, చిన్నరావులు ఉన్నారు. రాంబాబు కష్టంపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఈయన మృతితో ఆ కుటుంబం రోడ్డున పడిందని రోదిస్తున్నారు. ఎస్‌ఐ షేక్ ఖాదర్‌బాషా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం జాతీయ రహదారి రైల్వే ఫ్లైఓవర్ సమీపంలో మంగళవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో నందిగాం మండలం బడగాంకు చెందిన శిష్టు దేవేంద్ర, శిష్టు నవీన్‌లు గాయపడ్డారు. వీరు తన స్వగ్రామమైన బడగాం నుంచి విశాఖపట్నం వెళ్తున్నారు. హరిశ్చంద్రపురం ఫ్లైఓవర్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో సిబ్బంది స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐ షేక్‌ఖాదర్ బాష కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, దేవేంద్ర హెల్మెట్ దరించడంతో పెద్ద ప్రమాదం తప్పిందని పోలీసులు తెలిపారు.

టెక్కలి రూరల్ : మండలంలోని అక్కువరం సమీపంలో జాతీయ రహదారిపై సంభవించిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన మహేష్ గాయపడ్డాడు. మహేష్ బైక్‌పై వెళ్తుండగా... గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో గాయపడడంతో స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలిచారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



దహనమవుతున్న కార్లు

రెండు కార్లు దగ్ధం

రూ.4 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ జంట పట్టాల పరిధిలో ఉన్న వివేకానంద మార్గంలో సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డుపై మరమతుల కోసం ఉంచిన రెండు కారులు గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. ఈ ఘటనలో రూ.4 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... ముకుందరావు తమీమ్లకు చెందిన కార్ గ్యారేజ్ ఆ ప్రాంతంలో ఉంది. కార్లు ఇతర వాహనాలు ఇక్కడ మరమ్మతులు చేస్తూ ఉంటారు. కొండూరుకు చెందిన టాటా కారు, మారుతి హోమ్ని మరమ్మతులు చేసేందుకు ఇచ్చారు. దీనికి రూ.లక్ష వరకు పెట్టుబడి అవసరం ఉండడంతో రోడ్డుపైన పార్కింగ్ చేశారు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు కారులను దగ్ధం చేసినట్లు నిర్వాహకులు సిసి కెమెరా ఫుటేజ్ ద్వారా గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో కార్ల నుంచి పెద్ద మంటలు రావడంతో షెడ్ యజమానులకు స్థానికులు విషయాన్ని తెలియజేశారు. ఘటనా స్థలానికి వారు వచ్చే సమయానికే కార్లు పూర్తిగా మంటలో కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కార్లకు నిప్పు పెట్టినట్లు సిసి కెమెరా ఫుటేజ్‌లో లోడ్ అయిందని, అయితే వారు ఎవరని గుర్తించలేకపోతున్నామని అన్నారు. కాశీబుగ్గ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బహుమతుల ప్రదానం

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లిలో వెంకటేశ్వర ఇన్ఫ్రా డెవలపర్స్ హైదరాబాద్ వారి సౌజన్యంతో వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ప్రైమరీ లీగ్ పోటీల్లో విజేతలకు సమస్త అధినేత బసవల భానుప్రసాద్, సర్పంచ్ పి.దేవేందరరావు మంగళవారం బహుమతులను ప్రదానం చేశారు.

విద్యార్థులకు ఘన సన్మానం



సన్మానిస్తున్న సంఘం సభ్యులు

పలాస : చదువు ద్వారానే ఏ సామాజిక తరగతైనా సమగ్ర అభివృద్ధి సాధిస్తుందని యాదవ విద్యా నవ చైతన్య సదస్సు డొక్కరి ధనుంజయరావు అన్నారు. 2022-23లో ఎంబిబిఎస్, ఐఐటిల్లో జిల్లాకు చెందిన కొర్రాయి యోచన, మట్ట శృతి, కోరాడ శంకర, వినీత్, ఆవాల లక్ష్మి, చైతన్య ప్రకాష్, లండ మమతా కుమారి, బొల్ల జాహ్నవి, కొర్నాన తరుణ్ షీట్లు సాధించారు. అలాగే ఎకనామిక్స్ విభాగంలో తలగాన శ్రీనివాసరావు పిహెచ్‌డిని సాధించారు. వీరికి మండలంలోని పురుషోత్తపురంలో యాదవ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యాన మంగళవారం విద్యార్థులకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే కరోనా సమయంలో కోవిడ్ రోగులకు తన భుజాన వేసుకుని కింద నుండి నాలుగో అంతస్తు వరకు వెళ్లి ఆక్సిజన్ అందజేసి ప్రాణాలను కాపాడిన డాక్టర్ ఎదదాసుల యశ్వంత్‌నూ సన్మానించారు. లోడగల కామేష్, కొరికాని శంకరరావు, సప్ప నవీన్, డొక్కర్ శంకరరావు, కర్రి మాధవరావు, గోపాలరావు, దాసరి తాతారావు, అంబటి కృష్ణమూర్తి, కూర్మారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు

ప్రజాశక్తి- నౌపడ

పార్టీలో పనిచేసే ప్రతి కార్యకర్తకూ గుర్తింపు ఉంటుందని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కార్యకర్తలకు సూచించారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని పార్టీ కార్యాలయంలో మండలంలోని దండుగోపాలపురానికి చెందిన యువకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే బాధ్యత యువత తీసుకోవాలని సూచించారు.



అచ్చెన్నను కలిసిన యువకులు

కార్యక్రమంలో మండల ఐటిడిపి అధ్యక్షులు బెండి అరుణ్‌కుమార్, ఆరంగి శరత్, సురేష్, నరేష్, పద్మాలోచన, తిరుపతి, శ్రీధర్, అజయ్, నారాయణ, భాస్కర్, నాగరాజు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న గిరిబాబు

పలాస : క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడల్లో పాల్గొనేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జాతీయ స్థాయి సబ్ జూనియర్ టెన్నీకాయిట్ పోటీలకు శిక్షణా శిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.తులసీరావు, టెన్నీకాయిట్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శిక్షకుడు పి.తవిటయ్య, వ్యాయామ ఉపాధ్యాయులు కె.హరిబాబు, జాతీయ క్రీడాకారుడు ఎం.దామోదర్ పాల్గొన్నారు. కాగా శిక్షణ ఈ నెల 21వరకూ సాగుతుందని, జాతీయ పోటీలు ఈ నెల 22 నుంచి 26 వరకూ అనకాపల్లిలో నిర్వహిస్తారని తవిటయ్య వివరించారు.

తిలక్ పరామర్శ

కోటబొమ్మాళి: కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్, మాసాహెబ్‌పేట సర్పంచ్ సంపతిరావు హేమసుందరరాజు కుమార్తె కుమారిశ్రీ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ సోమవారం రాత్రి పరామర్శించారు. ముందుగా కుమారిశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం హేమసుందరరాజుతో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. అలాగే కోటబొమ్మాళి, నందిగాం ఎంపిపిలు రోణంకి



పరామర్శిస్తున్న తిలక్

ఉమామల్లేశ్వరరావు, ఎన్.శ్రీరామ్మూర్తి, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, నాయకులు అన్నెపు రామారావు, పేరాడ వెంకటరావు, మెండ తాతయ్య, నందిగాం పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణ, చింతాడ గణపతిరావు, సింగుపురం వినోద్, చింతాడ అనిరుద్ధడు, మెట్ట సింహాచలంలూ పరామర్శించారు.

ముగిసిన సంగమేశ్వర జాతర



దర్శనానికి బారులు తీరిన యాత్రికులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని గాజులకొల్లివలస వద్ద ఉన్న సంగమయ్య కొండపై సంక్రాంతి మూడు రోజుల పాటు నిర్వహించే యాత్ర మంగళవారం ముక్కనుమతో ముగిసింది. ముక్కనుమ చివరి రోజు కావడంతో వేలాది మంది యాత్రికులు కొండపైన ఉన్న శివాలయ దర్శనానికి బారులు తీరారు. యువకులు, పెద్దలు పిల్లలు అందరూ భారీ ఎత్తున యాత్రలో పాల్గొని ఆనందంగా గడిపి సందడి చేశారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచే సంగమయ్య కొండకు యాత్రికులు పెద్ద ఎత్తున పోటెత్తారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అలికాం, బత్తిలి రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

కనుమ వేడుకలు...

ఇచ్ఛాపురం: పట్టణంలోని బెల్లుపడాలో త్రినాథస్వామి కొండపై మూడు రోజులుగా నిర్వహించిన కనుము వేడుకలు సోమవారం రాత్రితో ముగిశాయి. ఇందులో భాగంగా కుమార



భారీగా తరలివచ్చిన ప్రజలు

డ్యాన్స్ మాస్టర్ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గాలిపటాలు పోటీలు నిర్వహించారు. అనంతరం నృత్య కళాకారులు డ్యాన్స్ మాస్టర్ కుమార్‌కు, అతని బృందానికి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దుశ్శాలువ కప్పి సన్మానించారు. చలి గాలిని లెక్క చేయకుండా ఉత్సవాలను తిలకించేందుకు తండోపతండాలుగా తరలివచ్చారు. ఎటువంటి అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా పట్టణ ఎస్‌ఐ ఐ.గోవిందరావు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న యువకులు

చిన్నారికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బొడ్డేపల్లిలో కేన్సర్‌తో బాధపడుతున్న చిన్నారి గురుగుబెల్లి లాస్యకు గ్రామానికి చెందిన పలువురు యువకులు అండగా నిలిచారు. గ్రామానికి చెందిన యువకులంతా కలిసి రూ.54 వేలు విరాళాలను సేకరించి మాజీ సర్పంచ్ బొడ్డేపల్లి సత్యం ఆధ్వర్యాన చిన్నారి నాన్నమ్మకు అందజేశారు. చిన్నారి లాస్య నాలుగేళ్లుగా బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతుండగా, విశాఖపట్నం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. తండ్రి గురుగుబెల్లి వాసుదేవరావు భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండగా, ఇతనికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అందులో చిన్న పాపకు బ్లడ్ కేన్సర్. దీనిపై ఎవరైనా దాతలు స్పందించి సహాయం చేయాలంటూ చిన్నారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



బంగారు వస్తువులను అందజేస్తున్న పాపారావు దంపతులు

అమ్మవారికి చిరుకానుక

ప్రజాశక్తి- కవిటి

చింతామణి అమ్మవారికి కవిటి చింతామణి కాలనీకి చెందిన బుర్రకాయల పాపారావు, రాజేశ్వరి దంపతులు మంగళవారం చిరుకానుక అందజేశారు. రూ.లక్ష పైచిలుకు విలువచేసే అమ్మవారి పుస్తెలతాడు, శతుమానం, ముక్కు పుడకలు పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఆరింగి త్రివిక్రమరావు, అగ్నికుల క్షత్రియ సంఘం నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, పిన్నింటి జయరావు, సంగారు శేషగిరి, సంగారు త్రివేణి, పొల్లాయి రాము పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

జి.సిగడాం : మండలంలోని మధుపాంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారు 15వ వార్షికోత్సవం సందర్భంగా ఉత్సవాలను మంగళవారం ప్రారంభించారు. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయాన్ని దర్శించుకునేందుకు యాత్రికులు బారులుతీరారు. యాత్రికులకు అన్ని



బారులు తీరిన యాత్రికులు

మౌలిక సదుపాయాలు కల్పించామని సర్పంచ్ బోగాది అప్పలనాయుడు తెలిపారు.

దుస్తుల పంపిణీ


ప్రజాశక్తి- నరసన్నపేట

నరసన్నపేటకు చెందిన వీరాచారి జ్ఞాపకార్థకం ఆయన కుటుంబ సభ్యులు పార్వతి, లక్ష్మి, షణ్ముఖరావు, చంద్రశేఖరరావులు స్వర్ణకారుల భవనంలో 60 మంది స్వర్ణకార కుటుంబాల పేదలకు, చీరలు, డ్రెస్సులు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూరెల్లా శంకరరావు, ఎఎంసి చైర్మన్ పొన్నాన దాలినాయుడు, శిష్టకరణం డైరెక్టర్ సదాశివుణి కృష్ణ, న్యాయవాది గొండు సత్యనారాయణ, విజయకుమార్, జి.గోపాలరావు, స్వర్ణకార నాయకులు తాళాబత్తుల గోవిందరావు, అద్దంకి మున్నా, లక్కోజి విశ్వనాథంలు పాల్గొన్నారు.

దుప్పట్లు...

మెళియాపుట్టి : మండలంలో జోడూరు పంచాయతీ అచ్చినాపురంలో 70 మంది గిరిజన వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు రెంటికోట వాసు దుప్పట్లను పంపిణీ చేశారు. తన తండ్రి పేరున పేదలకు తన వంతు సహాయం అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, రామస్వామి, పైల కూర్మారావు, పతివాడ బుడ్డు, వాసు పాల్గొన్నారు.

టెక్కలి : సంఘాలు, సంస్థలు ప్రజా చైతన్యానికి కృషి చేస్తూ... సమాజ అభివృద్ధిని కాంక్షించాలని విశ్రాంత మండల ఇంజినీరింగ్ అధికారి పమ్మిన సింహాచలం అన్నారు. ఈ మేరకు భావనామహర్షి వేడుక కార్యక్రమంలో భాగంగా 20 మంది పేద కుటుంబాలకు, వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు మల్లిపెద్ది మదుసూదనరావు, గౌరవ అధ్యక్షులు



నరసన్నపేట : దుస్తులను అందజేస్తున్న షణ్ముఖరావు



మెళియాపుట్టి : దుప్పట్లను పంపిణీ చేస్తున్న వాసు

దుంపా లోకేశం, సంఘం నాయకులు బస్వా శ్యాంసుందరరావు, ఆట్లపార్వతీశం, బుడ్డు నందికేశ్వరరావు పాల్గొన్నారు.

మిఠాయిలు...

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లికి చెందిన సూర్య స్నేహ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన పేదలకు, యాచకులకు మిఠాయిలు పంచిపెట్టారు. శ్రీకూర్మనాథస్వామి ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు డబ్బీరు శ్రీనివాస్ అందజేశారు. ఆలయానికి వచ్చే యాత్రికులకు ప్రతి ఆదివారమూ ఆరు వందల మందికి ఆహారాన్ని అందిస్తున్న ట్రస్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విద్యుత్‌శాఖ ఉద్యోగి మల్లేశ్వరరావును అభినందించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు కరెంట్ మల్లేసు, రాము గోవు, ఐ.వి.రమణ, ఉంగటి రమణ, తేజ, సురేష్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.